క్లుప్తంగా

నీట్‌లో 'కేఎల్‌ఎన్' విద్యార్థుల ప్రతిభ


ఎం. ఐశ్వర్య


వి. పూజశ్రీ

మిర్యాలగూడ: నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) ఫలితాలు మంగళవారం రాత్రి విడుదల కాగా మిర్యాలగూడ పట్టణంలోని కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు బుధవారం కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆలిండియా స్థాయిలో ఎం. ఐశ్వర్య 14567వ ర్యాంకు, వి. పూజశ్రీ 16,040, బి. మేఘన 22,108, ఆర్. అక్షయ 44,808 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఆయా రిజర్వేషన్ల కేటగిరీల్లో కళాశాలకు చెందిన 15మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, పీఎల్‌ఎన్ రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ధరణి'తో ఇబ్బందులు


దామరచర్ల తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

మిర్యాలగూడ: ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మిర్యాలగూడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ధనావత్ సిద్ధునాయక్ అన్నారు. బుధవారం ఆయన దామరచర్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలతో పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో అందక చాలామంది రైతులకు రైతుబంధు సాయం అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణిని తొలగించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ గణేష్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, గడ్డం నాగరాజు, పవన్‌నాయక్, చందునాయక్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పులిమామిడి మాజీ సర్పంచ్ మృతి


జానారెడ్డి (ఫైల్)

హాలియా: అనుముల మండలంలోని పులిమామిడి గ్రామ మాజీ సర్పంచ్ మాలే జానారెడ్డి(87) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం సాయంత్రం మృతిచెందారు. మర్లగడ్డగూడెం గ్రామానికి చెందిన మాలే జానారెడ్డి మారేపల్లి, పులిమామిడి పెద్ద గ్రామాలుగా ఉన్న సమయంలో ఉమ్మడి పులిమామిడి గ్రామపంచాయతీకి 30ఏళ్ల పాటు సర్పంచ్‌గా కొనసాగారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ ఆయన చురుగ్గా పనిచేశారు. జానారెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జానారెడ్డి మృతి పట్ల వివిధ పార్టీలకు చెందిన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

బీఎల్‌ఆర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

మిర్యాలగూడ అర్బన్: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ప్రైవేట్ అంబులెన్స్ యూనియన్ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబులెన్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు బాసటగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

త్రిపురారం: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కార్మికుడికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం బాసటగా ఉంటుందని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు అన్నారు. త్రిపురారం మండలంలోని దుగ్గెపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు పొలగాని వెంకట్‌నర్సు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం కల్లుగీత కార్పొరేషన్ నుంచి బుధవారం రూ.15 వేలు ఆర్థికసాయాన్ని పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు బాధితుడికి ఆస్పత్రిలో అందజేశారు. అనంతరం గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావుతో మాట్లాడి వెంకట్‌నర్సుకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి వెంట కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ తదితరులు ఉన్నారు.

తెలంగాణ దశ మార్చిన ఘనత కేసీఆర్‌దే

● మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ అర్బన్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం రాష్ట్రం దశ, దిశను మార్చి జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఏఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ప్రభుత్వ దవాఖానాలకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టణాల్లో బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయితే ప్రోత్సాహకాలను కూడా అందిస్తుందని అన్నారు. నల్లగొండ జిల్లాలోని 195 ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా అభివృద్ధి చేశారని వివరించారు. జిల్లాలోని 40 ఆరోగ్య కేంద్రాల నుంచి ఏడు వాహనాల ద్వారా ప్రతిరోజు రక్తనమూనాలను సేకరించి ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్నారని, ఇందు కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రూ.3కోట్ల విలువైన అధునాతన పరికరాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు పరిశీలించి వారి రాష్ట్రాల్లో కూడా కంటి వెలుగును అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం విశేష ప్రతిభ కనబర్చిన వైద్య సిబ్బందికి ప్రోత్సాహకాలతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు యూనిఫాం అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేశా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరథ్, మిర్యాలగూడ, వేములపల్లి, అడవిదేవులపల్లి మండలాల ఎంపీపీలు నూకల సరళ, పాదూరి గోవర్ధని, బాలాజీనాయక్, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఐరుగు మంగమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జెరిపోతుల రాములుగౌడ్, ఎంపీడీఓ దేవిక, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, నాయకులు అమరావతి సైదులు, చిర్రమల్లయ్య యాదవ్, సుధాకర్‌రెడ్డి, పద్మావతి, మాజీ కౌన్సిలర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బాలింతలకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు చేయించుకుంటే అబ్బాయి పుడితే రూ.10వేలు, అమ్మాయి పుడితే రూ.12 వేలు ప్రభుత్వం అందిస్తుందని, అంతే కాకుండా కేసీఆర్ కిట్‌తో పాటు తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు న్యూట్రీషన్ కిట్‌ను కూడా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ చెన్నయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరథ్ తదితరులున్నారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

● దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో కేసీఆర్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: ఆరోగ్య తెలంగాణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో భాగంగా దేవరకొండ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో కాన్పులు చేయించుకున్న మహిళలకు కేసీఆర్ కిట్లను అందజేసి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, జెడ్పీటీసీ మారుపాకల అరుణ, డిండి ఎంపీపీ మాధవరం సునీత, వైస్ చైర్మన్ రహత్ అలీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్, టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, పరమేష్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే నివాళి..

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని బాలాజీనగర్ వెంకటేశ్వస్వామి దేవాలయ బావోజీ మేఘావత్ హంజ మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ బుధవారం బాలాజీనగర్ చేరుకుని హంజ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, నర్సింహ, పరమేష్, బన్సీలాల్, వెంకన్న, రంగారెడ్డి, సంగూనాయక్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో లక్ష్మయ్య మృతదేహం

మిర్యాలగూడ టౌన్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొట్టి మృతిచెందిన ఘటన బుధవారం మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ అదనపు ఎస్‌ఐ ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన ఎం. లక్ష్మయ్య(35) బైక్‌పై దామరచర్ల మండల కేంద్రంలో అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామ శివారులో ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో లక్ష్మయ్య తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు మిర్యాలగూడ పట్టణంలోని శాంతినికేతన్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నట్లు తెలిసింది. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడు..

గుర్రంపోడు: ఆటో ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన కొప్పోజు మల్లయ్య(70) బుధవారం ఇంటి ముందు కూర్చున్నారు. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి మల్లయ్యను ఢీకొట్టడంతో గాయపడ్డాడు. అతడిని దేవరకొండ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మరో వ్యక్తి..

విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గుర్రంపోడు మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన నిమ్మల యాదగిరి(29) భార్య ధనమ్మ ఇటీవల తల్లిదండ్రుల వద్దకు పాల్వాయి గ్రామానికి వెళ్లింది. దీంతో అత్తగారింటికి వెళ్లిన యాదగిరి అక్కడ మామ మేకల యాదయ్య ఇంటిపైకి ఎక్కుతుండగా పక్కనే గల కరెంటు వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కింద పడిపోయిన యాదగిరిని దేవరకొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్


హాలియా: న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చిందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం హాలియా పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. హాలియాలోని పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. అనంతరం గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేసి, వైద్య ఆరోగ్య శాఖలో ఉత్తమ సేవలందించిన వైద్యులు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో నిడమనూరు ఎంపీపీ బొల్లం జయమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, పీడీ రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు చేకూరి హనుమంతరావు, యడవెల్లి మహేందర్‌రెడ్డి, తిరుమలగిరి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, తహసీల్దార్ మంగ, పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ఎంపీటీసీ ఊర్లగొండ వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం..

నాగార్జునసాగర్: పట్టణంలోని కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఎమ్మెల్యే నోముల భగత్ గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రూ.18.5కోట్లతో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బిన్ని, చైర్మన్ సలహాదారుడు కర్ణ శరత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మొద్దుకూరి రాంబాబు, కమిషనర్ రవీందర్‌రెడ్డి, సీఎంఓ భానుప్రసాద్, డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

త్రిపురారం: మండలంలోని కాపువారిగూడెంలో శ్రీమారెపల్లి బ్యాటో బాపు స్వామి కంకాళమ్మ తల్లి దేవాలయంలో బుధవారం నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి ఎమ్మెల్యే భగత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పానుగోతు అంజి, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్, రాష్ట్ర నాయకులు పెద్దబోయిన శ్రీనివాస్‌యాదవ్, మంగ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

● డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

పెద్దవూర: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ప్రతినిధి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి చేపట్టిన గిరిజన చైతన్యయాత్రను బుధవారం పెద్దవూర మండలంలోని గేమ్యానాయక్‌తండాలో శంకర్‌నాయక్ ప్రారంభించి మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గిరిజన తండాల్లో జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ప్రాంతంలో జరిగిన అభివృద్ధి అంతా కుందూరు జానారెడ్డి హయాంలో జరిగిందేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కుందూరు జైవీర్‌రెడ్డిని గిరిజనులంతా ఆశీర్వదించి గిరిజన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నిడమనూరు, త్రిపురారం మండలాల జెడ్పీటీసీలు నందికొండ రామేశ్వరి, భారతీబాయి, నాయకులు కొండేటి మల్లయ్య, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, పబ్బు యాదగిరిగౌడ్, భాస్కర్‌నాయక్, చింతల చంద్రారెడ్డి, అశోక్‌నాయక్, మోహన్, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జానారెడ్డి కుటుంబాన్ని ఆశీర్వదించాలి


పాదయాత్రను ప్రారంభిస్తున్న జైవీర్‌రెడ్డి తల్లి సుమతి

పెద్దవూర: కుందూరు జానారెడ్డి కుటుంబాన్ని వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కుమారుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. పెద్దవూర మండలంలోని గేమ్యానాయక్ తండాలో బుధవారం జైవీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి గిరిజన చైతన్య యాత్రను ప్రారంభించారు. జైవీర్‌రెడ్డి మాతృమూర్తి సుమతి ఆయన నుదుటిన తిలకం దిద్ది యాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, త్రిపురారం మండలాల్లోని 90 గిరిజన తండాల మీదుగా ఈ పాదయాత్ర కొనసాగి త్రిపురారం మండలం మాటూరులో ఈ నెల 30వ తేదీ వరకు ముగుస్తుందని తెలిపారు. గత తొమ్మిదేళ్లగా బీఆర్‌ఎస్ పార్టీ గిరిజనులను ఏవిధంగా మోసం చేస్తుందో చెప్పేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ఫోన్‌లో ఆశీర్వదించిన జానారెడ్డి..

సింగపూర్‌లో ఉన్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తన కుమారుడు జైవీర్‌రెడ్డికి ఫోన్ చేసి ఆశీర్వదించారు. తన కుమారుడు చేపట్టిన గిరిజన చైతన్య యాత్ర గేమ్యానాయక్‌తండా నుంచి ప్రారంభం కావడం సంతోషకరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రమావత్ శంకర్‌నాయక్, నిడమనూరు, త్రిపురారం జెడ్పీటీసీలు రాజేశ్వరి, భారతీబాయి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పబ్బు యాదగిరి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, చింతల చంద్రారెడ్డి, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బుడియా బాపు ఆలయంలో పూజలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని రంగుండ్ల గ్రామంలో గల గిరిజనుల ఆరాధ్య దైవం బుడియా బాపు దేవాయలంలో కుందూరు జైవీర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణనాయక్, కలసాని చంద్రశేఖర్, లాలునాయక్, బాలు, లక్ష్మణ్, మునినాయక్, అంజి, హరి, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి' పనులు పూర్తిచేయాలి

మిర్యాలగూడ అర్బన్: మన ఊరు-మన బడి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ పార్కు స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాంధీ పార్కు స్కూల్‌లో రూ.1.88 కోట్లతో మన ఊరు-మన బడి పనులు ప్రారంభించి ఏడాది అవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జగన్‌నాయక్, వదూద్, బిందు, రెహాన్, జువేద్, సాయిరాం, శంకర్ తదితరులున్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి


గణపతి ఆంజనేయస్వామి ఆలయంలో హోమంలో పాల్గొన్న జీవన్‌లాల్ లావుడియా

త్రిపురారం: ప్రతి వ్యక్తి భక్తిభావం కలిగి ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా, సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీ అదనపు కార్యదర్శి హనుమంత్‌నాయక్ అన్నారు. బుధవారం త్రిపురారం మండల డొంకతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్లావత్ తండాలో బంజారా మహిళ ఎన్‌జీఓ ఫౌండర్ కుటుంబ సభ్యులు నిర్మించిన గణపతి ఆంజనేయస్వామి ఆలయానికి వారు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు ఈసీ గోపాల్ సుజాత, దాదామరచర్ల జెడ్పీటీసీ హతీరాం, వెంకటరమణ, డాక్టర్ పూర్ణిమ, గోవింద్ పాల్గొన్నారు.

అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణం వద్ద ధరల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న ఏడీఏ వెంకట రవీందర్

గుర్రంపోడు: అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హాలియా ఏడీఏ వెంకట రవీందర్ అన్నారు. బుధవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి ఎమ్మార్పీ ధరలకే పత్తి విత్తనాలు విక్రయించాలని ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని అన్నారు. ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే రైతులు మండల వ్యవసాయాధికారి నంబర్ 7288894175కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి, ఏఈఓ జితేందర్ ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

హాలియా: దివ్యాంగులకు ఇస్తున్న రూ.3016 పెన్షన్‌ను రూ.4016కు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అనుముల మండలంలోని హజారిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు, దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందజేశారు. పోదిల సైదులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, గ్రామశాఖ అధ్యక్షుడు వహాబ్, ఉప సర్పంచ్ జమీనాజలీల్ పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంటిగొర్ల పాపయ్య, నాయకులు షేక్ బాసిద్, పెరుమాల వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి తరలించేందుకు అనుమతి ఇవ్వొద్దు

● తహసీల్దార్‌కు కన్నెకల్లు గ్రామస్తుల వినతి

మాడుగులపల్లి: మండల పరిధిలోని నాగుల చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలించేందుకు అనుమతి ఇవ్వొద్దని కన్నెకల్లు గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు తెలిపారు. చెరువులో సారవంతమైన మట్టిని అనాదిగా స్థానిక రైతులే పొలాలకు తరలించుకుంటున్నారని, ప్రస్తుతం కొందరు ఇటుక బట్టీల వ్యాపారులతో కుమ్మక్కై తరలించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. మట్టిని ఇష్టానుసారంగా తవ్వితే నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టు రైతులకు నష్టం జరుగుతుందని, భూగర్భ జలాలు తగ్గి బోరుబావులు ఒట్టిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ఎం. చిరంజీవి, కటకం పిచ్చయ్య, ఎస్. నాగరాజు, కె. వెంకన్న, శ్రీజ, కళమ్మ తదితరులు ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

మాడుగులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్ గ్రామ శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామ నడిబొడ్డున బొడ్రాయిని ప్రతిష్ఠింపజేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, సర్పంచ్ ఆగా అఫ్జల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

మాడుగులపల్లి మండలంలోని సీత్యాతండా గ్రామ పంచాయతీ ఆవాసం పుచ్చకాయలగూడెంలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మండల వైద్యాధికారిగా శైలి

డిండి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎస్. శైలి దేవరకొండ నియోజకవర్గ పరిధిలో ఉత్తమ మండల వైద్యాధికారిగా ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ చేతుల మీదుగా ఎస్. శైలి ప్రశంసా పత్రం అందుకున్నారు.

సంక్షిప్త సమాచారం

గోదాము నిర్మాణానికి భూమి పూజ

హాలియా: అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలోకొత్తపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ.37లక్షలతో చేపట్టిన గోదాము నిర్మాణానికి బుధవారం పీఏసీఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్‌రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రావుల సత్యం, సొసైటీ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డ వివాహానికి ఆర్థికసాయం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణానికి చెందిన నిరుపేద అయిన షేక్ మాజిద్ కుమార్తె వివాహానికి జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ. మునీర్ ఆధ్వర్యంలో బుధవారం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జనమైత్రి ఫౌండేషన్ సభ్యులు తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

త్రిపురారం: మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన మంద సైదయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.17వేల చెక్కును బుధవారం గ్రామ సర్పంచ్ బాల్తి పద్మ లబ్ధిదారుడికి అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

కొండమల్లేపల్లి: మండలంలోని కొత్తబావి గ్రామానికి చెందిన ఏరుకొండ రామలింగం కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేశ్‌నాయక్ బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి చేతుల మీదుగా వైద్య ఖర్చుల నిమిత్తం రామలింగం కుటుంబ సభ్యులకు రూ.15వేలు అందజేశారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

కొండమల్లేపల్లి: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ) తెలంగాణ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడిగా పిల్లుట్ల చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయూ దేవరకొండ డివిజన్ సర్వసభ్య సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అంజాచారి, ప్రధాన కార్యదర్శిగా సంపత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మందుబాబులకు జైలు శిక్ష

నాగార్జునసాగర్: విజయపురిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 13మందిని బుధవారం నిడమనూరు కోర్టులో ప్రవేశపెట్టగా వారికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు సాగర్ ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

పెద్దఅడిశర్లపల్లి: విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామపంచాయతీ పరిధి పిల్లిగుంటతండాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. పిల్లిగుంటతండాకు చెందిన రమావత్ శంకర్ ఆవు పొలంలో మేత మేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బాధిత కుటుంబానికి భరోసా

మాడుగులపల్లి: మండలంలోని పాములపహాడ్ గ్రామానికి చెందిన సలికొలిమి సత్యం పక్షవాతం బారినపడి మంచానికే పరిమితమయ్యాడు. నిరుపేద కుటుంబ కావడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం స్థానిక సర్పంచ్ యాతం లక్ష్మీనరేందర్‌రెడ్డి సత్యంను పరామర్శించి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు యాతం కొంగారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతకాయల సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నివాళి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన తెనాలి సైదిరెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బోయగూడేనికి చేరుకుని సైదిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'చలో హైదరాబాద్' కరపత్రం విడుదల

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన జాతిని విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్ ఫంక్షన్‌హాల్‌లో చలో హైదరాబాద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో కృష్ణానాయక్, అరుణ్‌నాయక్, గనినాయక్, సిరిసిల్ల శ్రీవాత్సవ తదితరులున్నారు.

తహసీల్దార్‌కు వినతి

డిండి: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే ఆయా పత్రాలు అందించాలని కోరుతూ బుధవారం డిండి మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు ఏఐవైఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి ఎనమల నవీన్, ఏఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు వినయ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులున్నారు.

'పల్లె ప్రగతి'ని జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న పల్లె ప్రగతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పల్లె ప్రగతి అభివృద్ధి నివేదికను ప్రజలకు తెలియచేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.